సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



అమ్మవారికి వజ్రాల హారం

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలోని శంకరమఠంలో కొలువై ఉన్న సర్వమంగళాదేవికి అజ్ఞాత భక్తులు సుమారు రూ.60 లక్షల విలువైన వజ్రాలహారం సమర్పించారు.



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: బ్రహ్మోత్సవాలకు శ్రీవారి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆలయ ధ్వజస్తంభం వద్ద చలువ పందిళ్లను నిర్మించారు.




26 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్ : ఈ నెల 26 నుంచి పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో అండర్‌-17 స్కూల్ గేమ్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు.

క్యాష్ లేదు.. జోష్ లేదు

- ఇబ్బడిముబ్బడిగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- ఇసుక కొరతతో పనుల్లేక పేదలు విలవిల
- కొనుగోళ్లు లేని వస్త్ర, కిరాణా, బంగారం దుకాణాలు
- సూపర్ సిక్స్ అని చెప్పి, అసలు సంక్షేమానికే ఎసరు
- పేదల ఇంట కనిపించని పండుగ కాంతులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలో దసరా పండగ డల్‌గా ఉంది. ప్రజల్లో గతేడాది ఉన్నంత పండుగ సంతోషం ఈఏడాది లేదు. కూటమి ప్రభుత్వం పుణ్యమా అని నిత్యావసరాలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన బాబు ప్రభుత్వం సంక్షేమం జాడ లేకుండా చేసింది. మరోపక్క ఇసుక దొరక్క భవన నిర్మాణంపై ఆధారపడిన పలు రంగాల ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి కరవై, చేతిలో డబ్బులు లేకుండా పోయాయి. పారిశ్రామిక, వాణిజ్య రంగాల పరిస్థితీ అంతంతమాత్రంగానే ఉండటంతో మధ్య తరగతి వారి పరిస్థితీ బాగోలేదు. దీంతో ప్రజల ఇళ్లల్లో పండుగ కాంతులు కరువయ్యాయి. దసరా పండుగను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఘనంగా జరుపుకొంటారు. దుస్తులు, బంగారం, స్వీట్ దుకాణాలు కిటకిటలాడుతుండేవి. నవరాత్రి రోజుల్లో కోట్లాది రూపాయల వ్యాపారం జరిగేది. ప్రస్తుతం మార్కెట్‌లో పండుగ శోభ కనిపించడం లేదు.

పనుల్లేక ఇబ్బందులు : పశ్చిమ గోదావరి జిల్లాలో 48,500, ఏలూరు జిల్లాలో 52 వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా పని చేస్తున్నవారు రెండింతలు ఉంటారని అంచనా. కూటమి ప్రభుత్వం ఇసుక దొరక్కుండా చేయడంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. దీంతో ఈ రంగంపై ఆధారపడిన వివిధ రంగాల కార్మికులకు పనుల్లేక పూటగడవడం గగనంగా మారింది. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితులు వచ్చాయి.

సంక్షేమం జాడ లేదు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా పేదలకు సంక్షేమ పథకాలేవీ అందడంలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు ఏటా రూ.20 వేలు, తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15,000, నిరుద్యోగులకు రూ.3,000 భృతి, 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఆర్థిక సాయం, ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ కూటమి నేతలు హామీలిచ్చినా, ఇప్పుడు నోరుమెదపడం లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తలుపు తట్టిన సంక్షేమం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా సంక్షేమ పథకాలు పేదల తలుపు తట్టేవి. ప్రభుత్వ సాయం వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచి, ఆనందాన్ని నింపేది. గత ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు నెలల మధ్య ఏలూరు జిల్లాలో అమ్మ ఒడి పథకం కింద 1,78,214 మంది తల్లులకు రూ.1,069.30 కోట్లు, కాపు నేస్తం పథకం కింద 19,869 మంది మహిళలకు రూ.119.21 కోట్లు, చేయూత కింద 1,16,491 మంది మహిళలకు రూ.561.53 కోట్లు, రైతు భరోసా రెండో విడత సాయంగా 2,35,847 మంది రైతులకు రూ.1830.24 కోట్లు సాయం అందింది. వీటితో పాటు సున్నా వడ్డీ రుణాల కింద 43,765 గ్రూపులకు రూ.221.99 కోట్లు, జగనన్న విద్యా దీవెన కింద 38,677 మంది విద్యార్థులకు రూ.383.40 కోట్లు, ఈబీసీ నేస్తం తదితర రూపాల్లో పేదలకు ప్రభుత్వ సాయం అందేది. పశ్చిమ గోదావరి జిల్లాలో అమ్మ ఒడి పథకం కింద 1,43,534 మంది తల్లులకు రూ.215.3 కోట్లు, కాపు నేస్తం పథకం కింద 34,642 మంది మహిళలకు రూ.51.96 కోట్లు, చేయూత పథకం కింద 84,523 మంది మహిళలకు రూ.155.73 కోట్లు, రైతు భరోసా సాయంగా 1,26,645 మంది రైతులకు రూ.137.57 కోట్లు సాయం అందేది. ప్రభుత్వం మారడంతో ఇంత పెద్ద మొత్తంలో వారు సాయం కోల్పోవడంతోపాటు, సొంత డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో పండుగ సందడే లేకుండా పోయింది.

ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు



గత ప్రభుత్వ హయాంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాల ద్వారా నేరుగా నగదు అందేది. దీంతో సామాన్య ప్రజల్లో కొనుగోలు శక్తి కూడా ఉండేది. టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకపోవడంతో సామాన్యుల ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు.

– జి.నాగసత్య ఝాన్సీలక్ష్మి, గృహిణి

వ్యాపారులకూ కరువుకాలమే



ఈ దసరా పండుగ వ్యాపారులకు కరువుకాలంగా మారింది. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోవడంతో దుస్తులు, వస్తువులు కొనడంలేదు. ఒక్కోరోజు దుకాణాల్లో బోణీ కూడా అవడంలేదు. దుకాణాల అద్దెలు ఎలా కట్టాలి, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక వ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు.

– జల్లూరి జగదీష్, రెడీమేడ్ దుస్తుల వ్యాపారి, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా

జయదుర్గా.. జయములీయవే



ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల క్షేత్రదేవత శ్రీకుంకుళ్లమ్మ, భీమవరం నాచువారి సెంటర్‌లోని కనకదుర్గమ్మ గురువారం దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



భీమవరం (ప్రకాశం చౌక్): నవదుర్గల దర్శనం

క్లుప్తంగా

దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీని బలవంతంగా పీకివేసిన ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. భీమవరంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ ఫ్లెక్సీని అన్యాయంగా తొలగించడమేగాక దళితులు, క్రైస్తవులపై రఘురామ చేసిన వ్యాఖ్యలు చాలా దారుణమన్నారు. రాజకీయపార్టీల నాయకులు కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడడం బాధాకరమన్నారు. తక్షణం సమస్యను పరిష్కరించకపోతే త్వరలో ఏలూరుపాడు ముట్టడి కార్యక్రమం చేపడతామని హర్షకుమార్ హెచ్చరించారు. సమావేశంలో తాళ్లూరి మధు, గంటా సుందర కుమార్, కోనా జోసఫ్, గుమ్మాపు సూర్యవరప్రసాద్, పరువు విజయకుమార్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

దెందులూరు: మండలంలోని మేధినరావుపాలెం గ్రామంలో హైస్కూల్ విద్యార్థిని ప్రేమ, పెళ్లి పేరుతో కల్లబొల్లి కబుర్లు చెప్పి గర్భందాల్చేలా చేసిన బాలునిపై పోక్సో కేసు నమోదైంది. దెందులూరు ఎస్సై కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మేధినరావుపాలెం గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక బంధువుల ఇంటికి మలసానికుంట వెళ్లింది. అమెను అక్కడ అదే గ్రామానికి చెందిన బాలుడు కొండేపూడి చందు పరిచయమై ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటున్నారని నమ్మబలికాడు. శారీరకంగా దగ్గరయ్యాడు. ఈ నేపథ్యంలో ఆమె గర్భం దాల్చడంతో తల్లిదండ్రులు సమస్యను గ్రామంలోని పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పెళ్లికి బాలుడు, అతని తండ్రి అంగీకరించారు. అనంతరం నిరాకరించడంతో మోసపోయామని గమనించిన బాలిక తల్లిదండ్రులు బంధువులు, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ తోపాటు వివిధ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఈ కేసును నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ విచారణ చేస్తారని ఎస్సై స్వామి తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి



జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒక వృద్ధురాలు మృతిచెందింది. ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగిశెట్టిగూడెం గ్రామానికి చెందిన జల్లి ముత్తమ్మ స్థానిక బస్టాండ్ సమీపంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. గురువారం స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి బయటకు వస్తున్న ముత్తమ్మ(60)ను, డిపోలోకెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్సు ముత్తమ్మ పైనుంచి పోవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్సై ప్రమాదస్థలికి వివరాలు సేకరించి, మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు. కాగా బస్సు రాజమండ్రి నుంచి జంగారెడ్డిగూడెం వస్తూ ఆర్టీసీ బస్టాండ్ లోపలికి వెళ్లే సమయంలో ఈ ఘటన జరిగింది. బస్సు వేగంగా రావడంతోనే ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో 'సూపర్' బాదుడు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అమరావతి, అన్న క్యాంటీన్, విజయవాడ వరద ముంపు పేరుతో కూటమి ప్రభుత్వం చందాల వసూలు చేస్తూ దందాలు చేస్తుందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకులో గురువారం అయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ వరద ముంపునకు సంబంధించి వివిధ సంస్థలు, వ్యాపారులు, ప్రజల నుంచి రూ.500 కోట్లకుపైగా చందాలుగా వసూలు చేసి ముంపు బాధితులను ఆదుకోలేకపోయారని దుయ్యబట్టారు. వరద ముంపునకు సంబంధించి 2 లక్షలకు పైగా ప్రజలను వేరే ప్రాంతానికి పంపించలేకనే భారీ వర్షాల పరిస్థితిని ప్రజలకు తెలపలేకపోయామని సాక్షాత్తూ ప్రిన్సిపల్ సెక్రటరీనే చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. విజయవాడ వరద ముంపు ఘటనలో 60 మందికిపైగా అమాయక ప్రజలను పొట్టనపెట్టుకున్నారని, అందులో 30 మంది కేవలం ఆకలితో చనిపోవడం బాధాకరమన్నారు. గతంలో వరదలు వచ్చిన సమయంలో జగన్ ప్రభుత్వం ఎలా స్పందించిందో, బాధితులను ఎలా ఆదుకుందో ప్రజలకు తెలుసునని అన్నారు. వాటర్ బాటిల్స్, పులిహోర, అగ్గిపెట్టు, కొవ్వొత్తులకు కోట్లాది రూపాయిల ఖర్చు చూపించడం హాస్యాస్పదంగా ఉందని, ఈ ఖర్చులన్నిటిపైనా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు సూపర్ బాదుడు

గత జగన్ ప్రభుత్వంలో చంద్రబాబు బాదుడే బాదుడు అనే కార్యక్రమాన్ని జనాల్లోకి తీసుకువచ్చారని, కానీ నేడు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని కూరగాయలు, వంటనూనె, నిత్యావసర సరుకుల ధరలు కొండెక్కించి చంద్రబాబు సూపర్ బాదుడు చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీ మీతోనే కలిసి ఉంది కదా ధరలు ఎందుకు తగ్గించలేకపోతున్నారని నిలదీశారు. అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేశారని మీ గెలుపు అనుమానాస్పదమని ప్రజలు సైతం ఈవీఎం ముఖ్యమంత్రిగాను, ఈవీఎం ఎమ్మెల్యేలుగాను మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇసుక ఫ్రీ అన్న కూటమి నాయకులు నేడు రూ.30 వేలు పెట్టినా లారీ ఇసుక దొరకని పరిస్థితికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ల్యాండ్ టైట్లింగ్ పేరుమార్చి నేడు అమలు చేస్తుండడం ప్రజలు గమనిస్తున్నారని, రైతాంగానికి గతంలో రూ.13,500 రైతు భరోసాగా అందచేసి జగన్ ప్రభుత్వం ఆదుకుంటే నేడు ఆ పథకాన్ని కూడా అమలు చేయలేకపోయారని విమర్శించారు.

ఏలూరులో నీతి ఆయోగ్ బృందం పర్యటన



ఏలూరు జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న నీతి ఆయోగ్ బృందం

ఏలూరు(మెట్రో): నీతి ఆయోగ్ (వ్యవసాయం) సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చంద్ నేతృత్వంలోని ఎనిమిది మందితో కూడిన బృందం గురువారం ఏలూరు జిల్లాలో పర్యటించింది. తొలుత జిల్లాలోని వెంకటాపురం గ్రామానికి వెళ్లి అక్కడ వర్షాకాలానికి ముందు విత్తన గుళికలను విత్తిన విధానము, ప్రకృతి వ్యవసాయం, 9 సార్వత్రిక సూత్రాలను, బయోఇన్పుట్లు తయారు చేసే పద్ధతులు, ఏఎండీఎస్ కిట్లను పరిశీలించారు. అదే గ్రామంలో తలారి జ్యోతి, నాగమణి, జయరాజు పొలాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరిస్తున్న వరి కాంపాక్ట్ బ్లాకులను సందర్శించారు. 10 మంది రైతులు 16 ఎకరాల విస్తీర్ణంలో చేసిన ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. అనంతరం బృందం వట్లూరులోని టీటీడీసీ భవనంలో రైతులతో ముచ్చటించారు. మిచాంగ్ తుపానుకు తట్టుకొని నిలబడ్డ ప్రకృతి వ్యవసాయ వరి పంట పొలాలతో పాటు, రసాయన పొలాల దుస్థితిని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన చాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్, సీనియర్ కన్సల్టెంట్ డీవీ రాయుడు, ప్రసాద్, సీనియర్ మాటిక్ లీడ్ గోపిచంద్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక



ఎం కిశోర్‌బాబు(ఫైల్)



ఎండీ కాలిష్(ఫైల్)



యశోద కృష్ణ

అత్తిలి: డీసీసీఐ, నారాయణ సేవా సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 25 వరకు రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్ర దివ్యాంగుల రాష్ట్ర జట్టులో పశ్చిమగోదావరి జిల్లా నుంచి ముప్పిడి కిశోర్‌బాబు, ఎండీ కాలిష్ ఎంపికైనట్టు జిల్లా కార్యదర్శి దాసం వెంకట దుర్గారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఫ్లైట్ టికెట్స్, డ్రెస్, కిట్ సదుపాయాలు కల్పించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్ష, కార్యదర్శులకు, ఆంధ్రరాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ జట్టుకు సదుపాయాలు కల్పించడానికి కృషిచేసిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రరాష్ట్ర ప్రతిష్టను పెంచాలనే ధ్యేయంగా ఈ టీం ప్రాక్టీస్ చేస్తోందని జిల్లా కార్యదర్శి దుర్గారావు చెప్పారు.

దివ్యాంగుల రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఆగిరిపల్లి యువకుడు

ఆగిరిపల్లి: దివ్యాంగుల రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఆగిరిపల్లికి చెందిన యువకుడు బెజవాడ యశోదకృష్ణ ఎంపికైనట్టు దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తుపాకుల కిషోర్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 25 వరకు రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో యశోద కృష్ణ పాల్గొంటాడని ఆయన చెప్పారు.

ఎమ్మెల్సీ గెలుపును జగనన్నకు కానుకగా అందిద్దాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతంరెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు : ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీని గెలిపించుకుని వైఎస్సార్ సీపీ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందిద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పొన్నూరు గౌతంరెడ్డితో కలసి కైకలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సభలో డీఎన్నార్ మాట్లాడుతూ నాలుగు మండలాల్లో పార్టీ నాయకులు ఆయా డిగ్రీ పట్టా పొందిన అందరి ఓట్లను నమోదు చేయించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గం నుంచి ఎక్కువ ప్రాధాన్యత ఓట్లు వేయించే విధంగా నాయకులు కృషి చేయాలని కోరారు. అభ్యర్థి గౌతంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేసిందేమి లేదన్నారు. వరదల సమయంలో అగ్గిపెట్టులు, కొవ్వొతులకు రూ.24 కోట్లు లెక్కచెప్పడం హాస్యాస్పదమని అన్నారు. తల్లి అమ్మ ఒడి నిల్ – తండ్రికి మద్యం ఫుల్ అనే ధోరణిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటు కోసం ఫాం 18ను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులు సైతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు అందించవచ్చన్నారు. నవంబరు 6 వరకు పట్టభద్రుల ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కలిదిండి, ముదినేపల్లి ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ నాయకులు బీవీ రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గౌతంరెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలిదిండి, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, గోట్రూ ఏసుబాబు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, పాము రవికుమార్, గాదిరాజు మణి కిషోర్‌వర్మ(కిట్టు), విష్ణు, బలే నాగరాజు, పంజా రామారావు, చినరాజు, శ్యామ్‌సుందర్, సోమేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

విజయదశమి ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ఏలూరు (టూటౌన్): దసరా పండుగ ప్రత్యేక రైళ్లను వారం రోజుల పాటు శ్రీకాకుళం అడ్డరోడ్డు వరకు పొడిగిస్తున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు ఈనెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో, శ్రీకాకుళం రోడ్డు నుంచి విజయవాడ వరకు ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో రైళ్లను నడపనున్నట్టు పేర్కొన్నారు. ఈ రైళ్లు ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతాయని వివరించారు. దసరాలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ రైళ్లను పొడిగించినట్లుగా అధికారులు పేర్కొన్నారు.

పంట రుణాల రీషెడ్యూల్‌కు అవకాశం

భీమవరం: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులు తీసుకున్న పంట రుణాలను రెండేళ్లపాటు రీ షెడ్యూల్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పంట రుణాల చెల్లింపు మారటోరియంతో కలిపి రెండేళ్లవరకు పొడిగించుకునే అవకాశం ఉందన్నారు. దీనికి బ్యాంకులు అదనంగా ఎటువంటి జరిమానా, వడ్డీ వసూలు చేసే అవకాశం లేదన్నారు. ఈమేరకు రైతులు బ్యాంకులను సంప్రదించి పంట రుణాలను రీషెడ్యూల్ చేసుకోవచ్చని కలెక్టర్ నాగరాణి తెలిపారు. బ్యాంకర్స్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలన్నారు.

రఘురామపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాళ్ల మండలం ఏలూరుపాడులో డాక్టర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని పెకిలించి సుమారు 25 రోజులు కావస్తున్న ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కేసు పెట్టలేదని, తక్షణమే అయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు చీకటిమల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రఘురామకృష్ణరాజును అరెస్ట్ చేయాలన్నారు. కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీ ఎస్సీ ఉద్యోగిపై చెయ్యి చేసుకున్నాడంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నర్ కలుగు చేసుకుని రఘురామను ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని, లేని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని, ఈ నెల 21 తేదీన ఈ వ్యవహారంపై డీజీపీని కలుస్తామని చెప్పారు. భేతాళ శరత్ బాబు, తుమ్మల ఫ్రాన్సిస్ రాజు, అంబటి కొండలరావు, మందా విజయ్ ప్రసాద్, మర్రి సోహన్ లాల్ పాల్గొన్నారు.

మానసిక వికలాంగులను ప్రేమతో ఆదరించండి

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి



శీతనపల్లి ఆస్పత్రి సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

కైకలూరు: సమాజంలో మానసిక వికలాంగులను ప్రేమతో ఆదరించాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శీతనపల్లి పీహెచ్‌సీలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ గుడులు, రోడ్ల వద్ద మానసిక వికలాంగులను గుర్తించి కోర్టుకు తీసుకొస్తే విశాఖపట్నం, హైదరాబాద్‌లో మానసిక వైద్యశాలలకు పంపుతామన్నారు. సాధారణ వ్యక్తులపై జరిగే అఘాయిత్యాల కంటే మానసిక వికలాంగులపై చేసే వాటికి కఠిన శిక్షలు అమలవుతాయన్నారు. అదే విధంగా చిన్న పిల్లలను పనులలో పెట్టడం కూడా నేరమన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.అన్నపూర్ణ, న్యాయవాదులు పి.ప్రసన్నకుమార్, డి.శివప్రసాద్, చింతపల్లి జయప్రకాష్, గ్రామ పెద్దలు ఎస్.పాండురంగారావు, కాజా రమేష్, కృష్ణ కుమార్, వైద్య సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'చింతమనేని కక్ష గట్టారు'

ఏలూరు రూరల్: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తనపై కక్ష కట్టి వేధింపులకు పాల్పడుతున్నారని ఏలూరు రూరల్ మండలం పెదయాగనమిల్లి గ్రామస్తుడు బలే పుట్టస్వామి, ఆయన కుమారుడు గురువారం ఒక వీడియోలో తమ ఆవేదన వెళ్లగక్కారు. గతంలో వైఎస్సార్ సీపీ నేత, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఎన్నికల సమయంలో గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తుండగా తాను గ్రామ పెద్దగా పూలదండ వేశానని తెలిపారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని చింతమనేని ప్రభాకర్ తనపై కక్ష కట్టారని ఆరోపించారు. టీడీపీ మండల నాయకులు నేతల రవి, నాగరాజు తదితరులచే తనపై పోలీసులను ఉసిగొల్పారన్నారు. నన్ను, నా కుమారుడిని స్టేషన్‌కు పిలిచించి గంటల కొద్ది కూర్చొబెట్టి వేధింపులకు గురిచేశారని పుట్టస్వామి వివరించారు. ఎంతోకాలంగా టీడీపీలో కొనసాగుతున్నప్పటికీ వేధింపులకు పాల్పడడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందన్నారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష ఏలూరు జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కునూరు కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్, వేలేరు కేజీబీవీలో స్వీపర్, వేలేరుపాడు కేజీబీవీలో డే వాచ్‌మెన్, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 2024–25 విద్యా సంవత్సర కాలానికి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

14న అప్రెంటిస్ షిప్ మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ఏలూరు నగరంలో అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఏలూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి పి.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ మేళాలో నూజివీడు మోహన్ స్పిన్‌టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నాగ హనుమాన్ ఆగ్రో ఆయిల్స్, శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్, బెంగళూరుకు చెందిన ఇండో ఎంఐఎం, డైకిన్ ఏసీ శ్రీసిటీ, మిత్ర ఫ్లూయిడ్స్ ట్రాన్స్‌ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలు హాజరై అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. 10వ తరగతి పాస్/ఫెయిల్, ఐటీఐ డిప్లమో లేదా ఏదైనా వృత్తి విద్యా కోర్సు చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 08812 230269లో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

రతన్ టాటా మృతికి వాకర్స్ సంతాపం



తణుకులో మౌనం పాటిస్తున్న వాకర్స్

తణుకు అర్బన్: పద్మవిభూషణ్ రతన్‌టాటా మృతికి తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాప్రాంగణ వాకర్స్ సంతాపం తెలిపారు. గురువారం ఉదయం రతన్‌టాటా మృతికి రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వాకర్స్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులతో పాటు పేదలకు ఎటువంటి సాయం అందించాలన్నా రతన్‌టాటా ముందుండే వారని అటువంటి మహనీయుడి మరణం దేశానికి తీరనిలోటని అన్నారు. ఏ విపత్తు వచ్చినా ముందుగా నేనున్నానంటూ కోట్లాది రూపాయిలు సాయం అందించిన వ్యక్తి మన మధ్యలేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరు సహాయకురాలి పోస్టుల భర్తీకి గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డీవో భవానీ శంకరి 25మంది అర్జీదారులను ఇంటర్వ్యూ చేశారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి సుజాత రాణి, సీడీపీవో టీఎల్.సరస్వతి, అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఆర్‌ఎస్‌కేలను వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్‌ఎస్‌కే) విక్రయించి, వాటి సేవలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్. ప్రసాద్ సూచించారు. గురువారం తాడేపల్లిగూడెంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 16వ తేది నుంచి మండలంలో 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. రైతులు పీఆర్.126 రకాన్ని ఆరబెట్టి తేమ 17 శాతంతో ఆర్‌ఎస్‌కేల్లో విక్రయిస్తే క్వింటాలుకు రూ.2320లు, 75 కిలో ల బస్తాకు రూ.1725లు చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు కొట్టు పాట్లు అమ్ముకోవలసిన అవసరంలేదని, ఆరబెట్టి తేమ శాతం 17 ఉంటే ఎఫ్ఏక్యూ నిబంధనలకనుగుణంగా ఆర్‌ఎస్‌కేలలో కొనుగోలు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



తణుకులో అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహిస్తున్న మాలదారులు

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి సమీపంలోని శ్రీధర్మ శాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామికి పడిపూజ నిర్వహించారు. గురుస్వామి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో నిత్యపూజారి సత్యనారాయణ సమక్షంలో స్వామికి విశేషాలంకరణ చేసి అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజన కార్యక్రమంలో చక్రి గురుస్వామి ఆలపించిన భక్తిగీతాలు భక్తులను అలరించాయి. పడిపూజలో అయ్యప్ప మాలదారులు పుల్లారావు, గాదె నాని, వెంకట్, ప్రసాద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

తాడేపల్లిగూడెం: మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని , దానికి కావాల్సిన చర్యలు చేపట్టాల్సి ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఆగిపోయిన నిర్మాణ పనులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసుతో కలిసి పరిశీలించారు. కడకట్లలోని స్విమ్మింగ్ పూల్, గణేష్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం, నిట్ సమీపంలోని క్రీడా మైదానం ప్రాంతాలను చూశారు. ఈ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే జేసీని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వై.భవానీ శంకరి, కమిషనర్ ఏసుబాబు, తహసీల్దార్ సునీల్‌లు ఉన్నారు.

ట్రస్టు సేవలు అభినందనీయం

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ద్వారా ఉచిత వైద్యసేవలు అభినందనీయమని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో వెంకటరమణ చారిటీ ద్వారా కొలనువాడ పెదకృష్ణంరాజు అందజేస్తున్న ఉచిత వైద్యసేవలను జేసీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రభుత్వ సేవలతో పాటు, స్వచ్ఛంద సేవా సంస్థలు సొమ్మును, సమయాన్ని వెచ్చించి సేవలు అందించడం అభినందనీయమన్నారు.పెదకృష్ణంరాజును జేసీ అభినందించి శాలువాతో సన్మానించారు. ముందుగా ప్రత్తిపాడు గ్రామానికి దాత కొలనువాడ పెదకృష్ణంరాజు అందించిన ఉచిత ట్యాంకర్‌ను జేసీ ప్రారంభించారు.

సిండికేట్ ఒకటే దారి



తణుకు మున్సిపల్ పరిధిలోని మద్యం దుకాణం



దరఖాస్తుదారుల అనుమానాలు నివృత్తి చేస్తున్న సీఐ మణికంఠరెడ్డి

- ప్రైవేటు మద్యం దుకాణాల్లో యూనిట్ వివాదం
- మండలం ప్రామాణికంగా ఎక్కడైనా దుకాణం
- తణుకులో 800 దరఖాస్తులు వచ్చే అవకాశం
- నేటితో దరఖాస్తుల స్వీకరణకు గడువు పూర్తి

తణుకు: కొత్త మద్యం దుకాణాలకు వేళయ్యింది. దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. మండలం యూనిట్‌గా ప్రకటనతో వ్యాపారులు సిండికేట్ కావడమే మార్గంగా కనిపిస్తోంది. ఇది కూటమి నేతలకు వరంగా మారింది. కూటమి నేతల కనుసన్నల్లోనే సిండికేట్ ఏర్పాటు కావడం తథ్యంగా కనిపిస్తోంది. దీంతో ఒక్కసారిగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు పోటెత్తాయి. నూతన మద్యం పాలసీలో ప్రభుత్వం పెట్టిన ఓ షరతు.. తప్పనిసరిగా సిండికేట్‌ను ప్రోత్సహించడం తప్ప మరో మార్గం లేదని స్పష్టమవుతోంది. అదే మండలం అంతా కలిపి ఒకే యూనిట్‌గా పేర్కొనడం. ఇలాగైతే వ్యాపారం చేయడం ఎలా సాధ్యం..? అనే ప్రశ్నకు సమాధానం.. సిండికేట్..! మరోవైపు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారంతో గడువు ముగియనుంది. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 33 షాపులకు గాను గురువారం రాత్రి వరకు 606 దరఖాస్తులు రాగా చివరి రోజైన శుక్రవారం గడువు పూర్తయ్యేలోపు 800 వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

సిండికేట్ ఎందుకు..?

2017, 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన మద్యం పాలసీల్లో మునిసిపాలిటీ పరిధిలో వార్డులఆధారంగా ఏ ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టుకోవాలో సరిహద్దులు సూచించేవారు. మండలాల్లో అయితే గ్రామ పంచాయతీని సరిహద్దుగా తీసుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు లైసెన్సులు జారీచేసేవారు. తాజాగా విడుదలైన పాలసీలో మునిసిపాలిటీ మొత్తాన్ని కలిపి ఓ యూనిట్, మండలాన్ని ఓ యూనిట్ పరిగణించారు. అంటే తణుకు మున్సిపాల్టీలో 9 దుకాణాలకు లైసెన్సులు ఇవ్వనున్నారు. యూనిట్ ప్రామాణికంగా తీసుకున్నట్లయితే ఈ 9దుకాణాలు పట్టణంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. ఓ వ్యక్తికి దుకాణం వచ్చి మంచి సెంటర్లో వ్యాపారం బాగా జరుగుతోంది అనుకుంటే మిగిలిన ఎనిమిది మంది పట్టణ పరిధిలో ఎక్కడెక్కడో దుకాణాలు పెట్టుకున్నా, వ్యాపారం జరగకపోతే, ఆ ఎనిమిదిమంది బాగా వ్యాపారం జరుగుతున్న దుకాణం పక్కనే మద్యం దుకాణాలు పెట్టుకోవచ్చు. అలాగే తణుకు మండలంలో అయిదు దుకాణాలకు లైసెన్సులు జారీచేస్తే, వేల్పూరు గ్రామంలో దుకాణానికి మంచి డిమాండ్ ఉంది. అక్కడ ఒక్కటే దుకాణం పెట్టుకోవాలనే నిబంధన లేదు. నాలుగు అక్కడే పెట్టుకోవచ్చు. అన్ని దుకాణాలు ఒక్కచోటే ఉంటే, వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగదు. దీనికి పరిష్కారం.. వ్యాపారులంతా కలిసికట్టుగా సిండికేట్ కావడం తప్ప మరో మార్గం లేదు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయించాలని, దుకాణాలు కూడా అన్నీ ఒకేచోట కాకుండా ఒక్కో దిక్కుకు ఒక్కొక్కటి పెట్టుకోవాలని సిండికేట్ నిర్ణయిస్తారు. ఈ విషయాన్ని బహిర్గతం చేయకనే, సిండికేట్‌ను ప్రోత్సహిస్తూనే ప్రభుత్వం మండల యూనిట్ అనే పదాన్ని పాలసీలో చేర్చినట్లు స్పష్టమవుతోంది.

గీత కార్మికుల పరిస్థితి ఏంటి..?

కల్లుగీత కార్మికులకు షాపుల కేటాయింపుపై ప్రభుత్వం తొలి విడతలో నిర్ణయం తీసుకోలేదు. రెండో దశలో అసలు షాపులు ఇస్తారా? లేదా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ షాపులు కేటాయించినా ఆదాయం వచ్చే షాపులు పూర్తయిపోతాయని, తమకు పనికి రాని ప్రదేశాల్లో షాపులు కేటాయిస్తే ఆదాయం ఎలా వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

ఏ ప్రాంతంలో ఎన్ని షాపులు?

తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మొత్తం 33 షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం సాయంత్రం నాటికి మొత్తం 606 దరఖాస్తులు రాగా ఫీజు రూపంలో రూ. 12.12 కోట్లు మేర ఆదాయం వచ్చింది. వీటిలో తణుకు మున్సిపాల్టీలో 9 షాపులకు గాను 159 దరఖాస్తులు వచ్చాయి. తణుకు మండలంలో 5 షాపులకు గాను 138, ఇరగవరం మండలంలో 4 షాపులకు గాను 102, పెనుగొండ మండలంలో 9 షాపులకు గాను 99, పెనుమంట్ర మండలంలో 6 షాపులకు గాను 80 దరఖాస్తులు వచ్చాయి.

సేవకులు ఆధ్యాత్మికతను వెలిగించాలి

పెంటపాడు: సువార్తికులు విశ్వాసులలో ఆధ్యాత్మిక ఉజ్జీవాన్ని వెలిగించాలని అంతర్జాతీయ సువార్తికులు రవి అబ్రహం పేర్కొన్నారు. గూడెం కొండాయి చెరువు వద్ద ఫెయిత్ చర్చిలో గురువారం యునైటెడ్ పాస్టర్ల అసోషియేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవకులు తమ సంఘాలలో దేవుని ఉన్నతమైన ఆధ్యాత్మిక బోధన చేయాలన్నారు. ఈ నెల 13 నుంచి గూడెంలో రవి అబ్రహాంమినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉజ్జీవ సమావేశాలను సేవకులు, విశ్వాసులు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజే జ్యోతి ఆనంద్, గాడ్స్ ప్రసన్న, గూడెం నియోజకవర్గ యుపీఏ నాయకులు డీఆర్‌కే మోజెస్, నాగేశ్వరరావు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సువార్తికులు పాల్గొన్నారు.

ఏలూరు బస్టాండ్‌లో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు కొత్తబస్టాండ్‌లో ఒక వ్యక్తి మృతి చెందాడు. తాడేపల్లిగూడెం మండలం పాతూరు గ్రామం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి సమీప ప్రాంతంలో నివసించే రెంకిరెడ్డి శ్రీనివాస చక్రవర్తి అలియాస్ చిన్న (45) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతునికి వివాహం కాలేదని, అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈనెల 9న ఏలూరు కొత్తబస్టాండ్‌కు వచ్చాడు. బస్టాండ్‌లోని 15వ నెంబర్ ప్లాట్‌ఫామ్ సమీపంలోని ఐరన్ బెంచీపై కూర్చుని మృతి చెందాడు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు.

వరప్రదాయిని.. జగజ్జనని

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు
- దుర్గాదేవిగా అమ్మవారు



అత్తిలి: ఆరవల్లిలో శ్రీదుర్గాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని కొలువైన దుర్గాదేవి అమ్మవారు



తాడేపల్లిగూడెం రూరల్: మహాగౌరిగా బాలాత్రిపుర సుందరీ అమ్మవారు



తణుకు టౌన్: దుర్గాదేవి అలంకరణలో దువ్వ దానేశ్వరి అమ్మవారు



తాడేపల్లిగూడెం (టీటీసీ): వన దుర్గాదేవిగా బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బాలాత్రిపుర సుందరీ పీఠంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరీ అమ్మవారిని గురువారం మహాగౌరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవావరణ పూర్వక విధానంలో ప్రత్యేక అర్చనలు, చండీ హోమం, విశ్వేశ్వరస్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు. అమ్మవారిని పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్ దర్శించి, ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాగౌరీ రూపం సకల అభీష్టాలు నెరవేర్చే రూపమని పేర్కొన్నారు. గౌరీదేవిని పూజిస్తే ఇష్టకామ్యాలు సిద్ధిస్తాయన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చండీ పారాయణ, చండీ హోమం, పుష్పార్చన, సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు.

శ్రీ దుర్గా దేవీ ఆలంకరణలో దువ్వ దానేశ్వరి అమ్మవారు

తణుకు టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మండపాక గ్రామంలో శ్రీ యల్లారమ్మతల్లి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, ఆలయ ఈవో పీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలోని శరన్నవరాత్రి వేడుకలు సందర్భంగా గ్రామ ఆర్యవైశ్య సేవా సంఘం భవన్‌లో గురువారం అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

పెంటపాడు: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం అమ్మవార్లను మహాలక్ష్మిదేవిగా అలంకరించారు. ప్రతి గ్రామంలోనూ అమ్మవార్లను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామివారి ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారికి గురువారం ప్రత్యేక అలంకరణ చేసారు. మహిళలు కుంకుమ పూజలు చేసారు. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని స్వయంభువుగా వెలసిన అమ్మవారిని మహలక్ష్మిగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మౌంజీపాడు కనక దుర్గమ్మ ఆలయంలో దసరా సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను గురువారం సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయంలో నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు ఆధ్వర్యంలో అమ్మవారిని వన దుర్గాదేవిగా విశేష ఆలంకరణ గావించారు. వనంలో ఉన్న విధంగానే ఆలయాన్ని, ఆవరణను వివిధ పూల మొక్కలతో, వేప ఆకులతో, కొబ్బరి మొక్కలు, అమ్మోరు తల్లి, పాముల పుట్ట, వినాయకుడు విగ్రహం, కోడి ఆకారం, పులులు, సింహాలు, తదితర వివిధ జంతువుల ఆకారాలను ఏర్పాటు చేశారు. వివిధ దేవతా మూర్తులు ప్రతిమలను ఉంచారు. భక్తులు విశేషంగా సందర్శించారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయంలో మహాలక్ష్మిదేవిగాను, శంకరమఠంలోని సర్వమంగళమ్మ వారిని కనకదుర్గాదేవిగాను, శ్రీదేవి మహాంకాళి అమ్మవారిని దుర్గాదేవిగాను, శ్రీ విశ్వదుర్గేశ్వరీ ఆలయంలో అమ్మవారిని హరితదేవిగాను, గాయత్రిదేవి అమ్మవారిని హరిత దుర్గాదేవిగా అలంకరించారు. లక్ష కుంకుమ పూజలు, కమలాలయ, చండీ హోమాలు జరిగాయి. బ్రహ్మనందరెడ్డి మార్కెట్‌లో రాజురాజేశ్వరీ అమ్మవారిని దుర్గాదేవిగాను, వార్ఫ్‌రోడ్డు అమ్మవారిని మహాకాళి అమ్మవారిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మలను దర్శించారు.

అత్తిలి: మండలంలోని శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో గల శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని గురువారం దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, సాయంత్రం కుంకుమ పూజలు జరిపారు. ఈసందర్భంగా భవానీ భక్తులు, భక్తులచే గ్రామంలో జ్యోతులతో ఊరేగారు. ఆలయకమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో అమ్మకాలు పెంచాలి



వేల్పూరులోని మార్ట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

తణుకు టౌన్: మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళా మార్ట్‌లో అమ్మకాలు పెంచి లాభాలు ఆర్జించేలా స్వహాయం సహాక సంఘాల మహిళలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, ఏపీఎం ఏ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు పాల్గొన్నారు.

తక్కువ ధరల కౌంటర్ ఏర్పాటు

తాడేపల్లిగూడెం: నాణ్యమైన వస్తువులను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు విక్రయిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసుతో కలిసి గురువారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్సులో కౌంటర్‌ను ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ నాణ్యమైన సరుకులను తక్కువ ధరలకు వినియోగించడం ప్రభుత్వం ధ్యేయమన్నారు. పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల ఆదేశాల మేరకు జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నర్సాపురంలలో రైతు బజారులలో, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేస్తారన్నారు. ఆర్డీఓ వై.భవానీశంకరి, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, సివిల్ సప్లయిస్. మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన



తణుకులో ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

తణుకు అర్బన్: ఎల్‌ఐసీలో 13లక్షలకుపైగా ఉన్న ఏజెంట్స్ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా కుట్ర చేస్తున్నారని ఏజెంట్స్ నాయకులు పీఎల్ నరసింహారావు అన్నారు. తణుకులో గురువారం ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏజెంట్స్‌పై జరుగుతున్న కుట్రలో సంస్థను బలహీనం చేసి తద్వారా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే విధంగా ఐఆర్‌డీఏ పావులు కదుపుతుందని విమర్శించారు. ఇటీవల ఎల్‌ఐసీ పాలసీలలో వచ్చిన మార్పులపై ఏజెంట్స్‌కు భారీగా కమిషన్ తగ్గిస్తూ, పాలసీదారులకు ప్రీమియం పెంచడం దారుణమని స్పష్టం చేశారు. 55 సంవత్సరాల వయస్సువారికి ఇచ్చే సరళతర పాలసీలను నేడు 50 సంవత్సరాలకు పరిమితం చేయడం బాధాకరమన్నారు. ఎల్‌ఐసీ మేనేజ్‌మెంట్ తీసుకున్న ఏజెంట్స్ వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని యూనియన్‌ల ఏజెంట్లు ఐకమత్యంగా పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. బ్రాంచ్‌కి సంబంధించిన ఏజెంట్లు పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణాను అడ్డుకోవాలి



నీలాద్రిపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: బాలికల అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.బేబి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని నీలాద్రిపురం అంగన్‌వాడీ కేంద్రం.109 ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బేబి మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికల సంరక్షణ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌పై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వై.వీరనాగు, ఎం.కృష్ణకుమారి, ఎం.పద్మావతి, సెక్టార్ లీడర్లు పి.రాణి, ఎ.నర్సరాణి, 27 గ్రామాల్లోని అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలి: లింగ అసమానత నివారణ, ఆరోగ్య రక్షణ కోసం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ కె కుమారి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గురువారం అత్తిలి-16 అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన ప్రజా ప్రతినిధులు

అత్తిలి: గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో పంచాయతీ సభ్యులు భాగస్వామ్యం కావాలని ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు కోరారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. పంచాయతీ సమావేశాలు, పారిశుద్ధ్యం, సొంత వనరులు, తాగునీరు సరఫరా, వీధి దీపాల నిర్వహణ, భవన నిర్మాణాల అనుమతులు, సంక్షేమ పథకాలు, పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, న్యాయ అక్షరాస్యత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో శామ్యూలు, ఈవోఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జట్లపాలెంలో రామాలయ ప్రతిష్ఠ

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం గ్రామంలో యాదవపేటలో గురువారం రామాలయ విగ్రహప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్ర, శిఖర ప్రతిష్ఠ పూజలతో పాటు, యాగశాల ప్రవేశం, దీక్షధారణ, పూర్ణాహుతి, కళాన్యాసం, కుంభారాధన పూజలను ఘనంగా నిర్వహించారు.